క్లుప్తంగా

ఆసుపత్రిలో వసతుల పరిశీలన


వసతులను పరిశీలిస్తున్న వైద్య బృందం

నంద్యాల టౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైద్య బృందం శుక్రవారం తనిఖీ చేసింది. డాక్టర్ రేణుక దేవి, డాక్టర్ రమణబాబుల ఆధ్వర్యంలోని వైద్య బృందం ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరుకొని అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, తరగతి గదులు, ల్యాబోరేటరీలు పరిశీలించి ఆస్పత్రి వైద్య కళాశాల అధికారులకు పలు సూచనలు చేశారు.

29న రాష్ట్రస్థాయి ఉద్యమం


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం


నంద్యాల(న్యూటౌన్): శాస్త్రీయ విద్యాసాధన, ప్రభుత్వ విద్య పరిరక్షణకు చేయాల్సిన ఉద్యమ కార్యాచరణ విషయమై ఈనెల 29న విజయవాడలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ తెలిపారు. స్థానిక ఓ ప్రైవేటు కళాశాల వద్ద శుక్రవారం సమావేశ కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు షాహిదీ, బాషా, కల్యాణ్, న్యామతుల్లా, వీరేంద్ర, పవన్, హరి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పౌర్ణమి


సేద్యం చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరులో ఏపీ రైతుసంఘం నాయకులు శుక్రవారం ఏరువాక పౌర్ణమి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సభ్యులు మోటర్ రాముడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి భాస్కర్, మండల నాయకులు బాలనసింహుడు, వెంకటేశ్వర్లు తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు. ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు మాట్లాడుతూ 50 ఏళ్లు పైబడిన ప్రతి సన్న, చిన్నకారు రైతుకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. వ్యవసాయానికి అవసరమైన ట్రాక్టర్లు, పంట కోత యంత్రాలు 90 శాతం రాయితీపై రైతులకు అందించాలన్నారు. అనంతరం వారు ఎద్దుల కాండ్లకు పూజలు చేసి ఏరువాకను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, సుబ్బరాయుడు, రామచంద్రుడు, మధు, పెద్దిరెడ్డి, లింగయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ


పల్లకీలో విహరిస్తున్న స్వామివారు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతశర్మ, అర్చకులు శరభయ్య, బృందం ముందుగా అలంకార మండపంలో స్వామి, అమ్మవారి దంపతులకు విశేషపూజలు చేపట్టారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ నిర్వహించారు.

వేలం పాటల్లో పెరిగిన ఆదాయం


వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో కొలువైన ఈశ్వర, చెన్నకేశవస్వామి దేవస్థానాలకు చెందిన భూములకు శుక్రవారం నిర్వహించిన వేలాల ద్వారా ఆదాయం పెరిగినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆలయాలకు చెందిన 42.06 ఎకరాల భూములకు నిర్వహించిన వేలాల ద్వారా రూ.8,45,400 వచ్చిందన్నారు. గత ఏడాది ఈ భూముల ద్వారా రూ.7,51,200 రాగా ప్రస్తుతం రూ.94,200 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. మొత్తం 26 మంది డిపాజిట్లు చెల్లించారన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

▶ఒత్తిడి దూరం


ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో యోగాసనాల్లో ఎంపీడీఓ, సిబ్బంది

ఉయ్యాలవాడ: ప్రతి రోజు యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించవచ్చని ఎంపీడీఓ రఘురాం అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులుతో కలిసి సూర్య నమస్కారాలు, యోగాసనాలు నిర్వహించారు. మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవగౌడ్ యోగాసనాలు వేయించారు.


మాయలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆసనాలు చేయిస్తున్న పీఈటీ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా అదనపు జడ్జి మురళీకృష్ణ


ఏపీ మోడల్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


యోగా చేస్తున్న అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ


దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

ఆళ్లగడ్డ: ప్రతిరోజు యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యకర జీవితం పొందవచ్చని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జడ్జి మురళీకృష్ణ అన్నారు. అంతార్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన యోగా తరగతులకు ఆయన హాజరై యోగా అభ్యాసకులతో కలిసి యోగాసనాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. యోగాతో మానసిక, శారీరక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శైలజ, జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వర్‌వెంకటప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, యోగా మాస్టర్ వెంకటాద్రి ఉన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో..

ఆళ్లగడ్డ ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాజు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు చేయించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగాతో దీర్ఘకాలిక రోగాలు కూడా నయమవుతున్నాయని, ప్రతి ఒక్కరూ కాసేపైనా యోగా చేయాలని సూచించారు.

మానసిక ప్రశాంతత

దొర్నిపాడు: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంఈఓ రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా వల్ల బీపీ షుగర్ అదుపులో ఉండటంతో పాటు ఎంతో ఉల్లాసంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ దేవేంద్ర పాల్గొన్నారు.

▶ఆరోగ్యం పదిలం


రుద్రవరం మోడల్ స్కూల్‌లో ఆసనాల్లో విద్యార్థులు

రుద్రవరం: యోగా వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బరాయుడు విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో యోగాసనాలు వేశారు. జెడ్పీ ఉన్నత, తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలల్లో ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.

ఘనంగా యోగా దినోత్సవం


మున్సిపల్ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు


బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విన్యాసాలు


ఆయుష్ యోగా కేంద్రంలో యోగాసనాలు



యోగా గురువును సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్/(వ్యవసాయం/(అర్బన్)): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగా కార్యక్రమాల్లో పాల్గొన్న క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి రాజు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ రవికుమార్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. మానసిక, శారీరక, ఆధ్యాత్మిక సమతుల్యత యోగా అభ్యాసన వల్ల కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులచేత ఎన్‌సీసీ కేడెట్లు ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు అసదుల్లా హుసేన్, పద్మావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయ కర్త డాక్టర్ గంగన్న, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. విద్యార్థులతో యోగాసానాలు చేయించి, వారికి యోగా విశిష్టతను వివరించారు.

▶బాలకార్మిక పాఠశాలలో స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్త సంపత్‌కుమార్ పాల్గొని యోగా గురించి చిన్నారులకు వివరించారు. కార్యక్రమానికి సొసైటీ నిర్వాహకులు గడ్డం సుబ్బరాయు డు, వార్డెన్ నాగలక్ష్మి, టీచర్ లక్ష్మీదేవి, రాజు పాల్గొన్నారు.బాలికల ఉన్నత పాఠశాలలోప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో యోగా డేను నిర్వహించారు.

▶మున్సిపల్ టౌన్ పార్కులో ఆయుష్ యోగా సేవా సమితి, యోగా గురువు ఖండే ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు నిర్వహించిన అనంతరం హోమాలు, భజన కార్యక్రమాలు చేపట్టారు.

▶ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బందితో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించి, ధ్యానం ఉపయోగాలను తెలియజేశారు.

▶హౌసింగ్ బోర్డు కాలనీలోని అమరయోగ వికాస కేంద్రంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. శిక్షకుడు యోగానంద, సభ్యులు పాల్గొన్నారు.

▶స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ సౌభాగ్యం, ఈఓ షానుల ఆధ్వర్యంలో సిబ్బంది యోగాసనాలు చేశారు. ఎంపీడీఓ సౌభాగ్యం మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

పోటాపోటీగా వేలం పాటలు


వేలం పాటలను నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: బోయలకుంట్లలో శుక్రవారం వివిధ ఆలయాల మాన్యం భూములకు కౌలు బహిరంగ వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో జరిగిన వేలం పాటలలో ఆలయాలకు గతేడాదికంటే రూ.2.93 లక్షల ఆదాయం సమకూరింది. శ్రీ రామేశ్వర, వీరభద్ర, శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయాలకున్న 66 ఎకరాలకు గతేడాది రూ.11.14 లక్షలు రాగా.. ఈ ఏడాది రూ.14.07 లక్షల ఆదాయం వచ్చింది. 62 మంది డిపాజిట్లు చెల్లించి వేలంపాటల్లో పాల్గొనగా 17 మంది రైతులు పొలాలను కౌలుకు దక్కించుకున్నారు. వేలం పాటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఎస్‌ఐ సురేష్ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయాలు, సొసైటీ చైర్మన్లు జింకల నారాయణ, శివలింగం, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి


నర్సాపురం సచివాలయ ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న ఈఓపీఆర్డీ

రుద్రవరం: నిర్ణీత సమయానికి వచ్చి విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఈఓ పీఆర్డీ శ్రీనివాస శర్మ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండల పరిధిలోని నర్సాపురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. హాజరు పట్టిక, రికార్డులు పరిశీలించారు. అనంతరం వారికి పలు సూచనలు ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చే బాధితులతో మంచిగా మెలగాలన్నారు. అనంతరం ఆయన పీహెచ్‌సీ ఉద్యోగులతో కలిసి సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఆడపిల్ల చదువుకోవాలి


కాన్వొకేషన్ సర్టిఫికెట్లను అందజేసిన దృశ్యం

నంద్యాల(అర్బన్): ఆడపిల్ల చదువు దేశానికి వెలుగు కాబట్టి ప్రతి ఆడపిల్ల చదువుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం అంగన్‌వాడీ విద్య అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించే కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు కాన్వొకేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మొదట బాలికలతో యోగాసనాలు చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్లు నజీర, ఆరోగ్యమ్మ, విజయలక్ష్మి, సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): నీట్ పరీక్షను రద్దు చేసి, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు సంబంధించిన వారు కావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సురేష్, శ్రీకాంత్, చంద్ర, రమణ, పాల్గొన్నారు.

కాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో వైశాఖ శుక్రవారం పురస్కరించుకుని కాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఒడి బియ్యం, పుష్పాభిషేకం, మహామంగళ హారతులు, రాహుః కాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులను చేసి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏడవ తరగతిలో ఓసీ జనరల్ – 2, ఎస్సీ జనరల్–1, 8వ తరగతిలో ఓసీ జనరల్–2, 9వ తరగతిలో ఓసీ జనరల్–2, ఎస్సీ జనరల్–1 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులను పాఠశాలలో అందించాలన్నారు. ఈనెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ కమ్ రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

పొదుపు సమావేశానికి ఏపీఎం డుమ్మా


వెలుగు సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశం

గోస్పాడు: నెలకోసారి జరిగే గ్రామైక్య సంఘాలకు సంబంధించిన పొదుపు సమావేశానికి శుక్రవారం ఏపీఎం రామశేఖర్‌రెడ్డి డుమ్మా కొట్టారు. నలుగురు సీసీల్లో ఒకరు సెలవులో ఉండగా ముగ్గురు హాజరయ్యారు. అందులోనూ ఇద్దరు సీసీలు శ్రీనివాసులు, పుల్లయ్యలు అక్కడి నుంచి తప్పుకోగా ఉన్న ఒకే సీసీ సంపత్ సమావేశానిన్న నిర్వహించారు. ఇక మండల ఐక్య సంఘం అధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న, మండల కార్యదర్శి రమణమ్మతో పాటు గ్రామైక్య సంఘాల లీడర్లు హాజరయ్యారు. లక్ష్మీప్రసన్న, రమణమ్మ మాట్లాడుతూ నెలకోసారి నిర్వహించుకునే సమావేశంలో పొదుపు గ్రూపుల్లో నిర్వహించే లావాదేవీలు, బ్యాంకు లింకేజీ రుణాలు, శ్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి వంటి రుణాల చెల్లింపులు, గ్రామ సంఘాల పనితీరు, పొదుపు సంఘాలు నిర్వహణ తదితర విషయాలు చర్చించుకుంటామన్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న సమావేశంలో ఈసారి ఎలాంటి చర్యలు లేకపోవడం బాధాకరమన్నారు. గైర్హాజరైన విషయమై ఏపీఎం రామశేఖర్‌రెడ్డిని 'సాక్షి' ఆరా తీయగా సమావేశం ఉన్నట్లు మెసేజ్ చేసిన విషయం తనకు తెలియదని, జూమ్ మీటింగ్ నిమిత్తం కార్యాలయానికి రాలేకపోయానని తెలిపారు.

ఖరీఫ్ సాగు ప్రారంభం


హరివరం సమీపంలో మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

ఉయ్యాలవాడ: మండలంలో ఇటీవల రెండు రోజుల క్రితం భారీ వర్షం కురిసింది. 109.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఏటా కుందూనది తీరం వెంట ఉన్న 14 గ్రామాల్లో 980 హెక్టార్లలో వరి సాగు అయ్యేది. ఈ ఏడాది వరికి ప్రత్యామ్నాయంగా కొంత మంది రైతులు ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. హరివరం, మాయలూరు, అల్లూరు, ఇంజేడు, పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ, తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేసే పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు నిమగ్నమయ్యారు. మార్కెట్‌లో క్వింటా రూ. 2,500 వరకు ధర ఉండడంతో పాటు పెట్టుబడి వరితో పోలిస్తే తక్కువ ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. రెండు, మూడు నీటి తడులతోనే మొక్క జొన్న దిగుబడులు చేతికి వస్తాయని రైతులు పేర్కొంటున్నారు.

విస్తారంగా మినుము సాగు

దొర్నిపాడు: మండలంలో విస్తారంగా మినుము సాగు చేస్తున్నారు. తొలకరి పలకరించడంతో రైతులు నల్లబంగారంగా చెప్పుకునే మినుమును ఖరీఫ్ తొలి పంటగా శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మండలంలో 200 హెక్టార్లకు పైగా సాగుచేశారు. 90 రోజుల పంటే కావడంతో రైతులు ఏటా మినుము సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.10 వేలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయంటున్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పోయినా రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


క్రిష్టిపాడులో మినుము విత్తుతున్న దృశ్యం

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో అడ్డుకున్న వీఆర్‌ఏలు
- కాసేపటికే మళ్లీ కొనసాగింపు
- చేష్టలుడిగిన అధికారులు


శ్రీరంగాపురం ఎస్‌ఎస్ ట్యాంకు కట్ట పక్కనే జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టర్‌లోకి వేస్తున్న దృశ్యం

రుద్రవరం: రెండు మండలాల్లోని 8 గ్రామాల ప్రజలకు తాగు నీరందించే ఎస్‌ఎస్ ట్యాంక్ చుట్టూ ఏర్పాటు చేసిన మట్టి కట్ట పక్కనే కొందరు యథేచ్ఛగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నా అడిగే నాథుడే లేరు. కాసులకు కక్కుర్తి పడ్డారో.. తమకెందుకులే అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ స్థానిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కొందరు ఇచ్ఛల విడిగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలిసి ఛీవాట్లు పెట్టడంతో గ్రామ స్థాయి అధికారులు హడావుడిగా ఘటనా స్థలానికెళ్లి ఆపేసినా కొంతసేపటికే మళ్లీ మట్టి తవ్వకాలు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. రుద్రవరం మండల పరిధిలోని శ్రీరంగాపురం వద్ద శ్రీరంగాపురంతోపాటు రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లోని 8 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించారు. నీటి నిల్వ కోసం కొంత భూమిని సేకరించి చుట్టూ మట్టి కట్ట నిర్మించారు. ట్యాంక్ సమీపంలో దాదాపు మూడునాలుగెకరాల డీకేటీ భూమి ఉంది. దాన్ని ఆక్రమించుకునే క్రమంలో కొందరు అందులోని మట్టిని తవ్వుతున్నారు. ప్రస్తుతం ఆ కట్టకు దిగువ భాగంలోనే మట్టి తవ్వకాలు చేపట్టడంతో ఎస్‌ఎస్ ట్యాంకు కట్ట బలహీన పడే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నా గ్రామ స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో వారు గ్రామ స్థాయి అధికారులను దండించినట్లు సమాచారం. దీంతో ఓ వీఆర్‌ఏ శుక్రవారం ఘటనా స్థలానికెళ్లి మట్టి తవ్వకాలను ఆపేశారు. అయితే కాసేపటికే మళ్లీ మట్టి తవ్వకాలను ప్రారంభించడంతో ముడుపులు ముట్టి ఉంటాయని, అందుకే అనధికార అనుమతులు ఇచ్చి ఉంటారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వీఆర్వో నీలకంఠను వివరణ కోరగా ఇళ్ల వద్ద బేస్ మట్టాలకు తీసుకెళ్తామంటే కాదనలేకపోయామని, ఇందుకు ఎలాంటి ముడుపులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. ఎస్‌ఎస్ ట్యాంక్ తెగిపోక ముందే ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని మట్టి తవ్వకాలను ఆపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా తిరుచ్చి వేడుకలు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాస పౌర్ణమి శుక్రవారం స్వామి వారికి తిరుచ్చి మహోత్సవం భక్తజనసందోహం మధ్య వైభవంగా జరిగింది. ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు వేదపండితులు కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.